# కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక

## పరిచయం

1848 నాటి విప్లవం



విప్లవకారులపై కోర్టు విచారణ




జర్మన్ మూలం :

**మార్క్స్, ఎంగెల్సులు**

ఇంగ్లీషు అనువాదం :

**శామ్యూల్ మూర్**

ఇంగ్లీషునించి తెలుగు అనువాదం :

**రాచమల్లు రామచంద్రారెడ్డి**

పరిచయం :

**రంగనాయకమ్మ**

# విషయ సూచిక

* ముందుమాట - **4**
* 'ప్రణాళిక'కు మార్క్సు ఎంగెల్సుల 'ముందుమాట' గురించి - **10**

**1.** బూర్జువాలూ, కార్మికులూ................ **15**
**2.** కార్మికులూ, కమ్యూనిస్టులూ ........... **45**
**3.** సోషలిస్టు, కమ్యూనిస్టు సారస్వతం ... **68**

**1)** ప్రగతి వ్యతిరేక సోషలిజాలు- 68

(1) ఫ్యూడల్ సోషలిజం - 68

(2) క్రైస్తవ సోషలిజం -73

(3) పెటీ బూర్జువా సోషలిజం - 74

(4) జర్మన్ సోషలిజం లేక, "అసలు" సోషలిజం-76

**2)** యధాస్తితి వాద సోషలిజం లేక, బూర్జువా సోషలిజం -87

**3)** విమర్శనాత్మక ఊహాస్వర్గ సోషలిజమూ, కమ్యూనిజమూ -91

**4.** ఈ నాటి వివిధ ప్రతిపక్ష పార్టీల పట్ల, కమ్యూనిస్టుల వైఖరి.... **99**

* 'ప్రణాళిక'కు వేరు వేరు భాషల్లో జరిగిన ప్రచురణలకు మార్క్సు, ఎంగెల్సులు రాసిన '**7** ముందు మాటలు'.**102**
* ఈ ప్రణాళిక చదివి, ఏం తెలుసుకుంటాం? ............**127**
* రష్యా వారి ప్రణాళిక 'ముద్రణ' గురించి ..................**135**

# 1. బూర్జువాలూ - కార్మికులూ[6]

[ ఈ చాప్టరుకి వున్న పేరు దగ్గిరే 6 వ ఫుట్ నోట్ వచ్చింది. ఈ ఫుట్ నోట్లు పెద్దవిగా కూడా ఉన్నాయి. ఒక ఫుట్ నోట్ కొంత పెద్దదిగా వున్నప్పుడు, దాన్ని, దాని నంబరు వచ్చిన పేజీలోనే ఇవ్వాలంటే, ఆ ఫుట్ నోట్‌లో నించి కొంత భాగాన్ని తర్వాత పేజీలోకి మార్చవలిసి వస్తుంది. దాని కన్నా తేలికగా అర్థం చేసుకునే పద్ధతి: పెద్ద ఫుట్ నోట్‌ని కూడా, అసలు పాఠంలోనే, దాని నంబరు వున్న చోటే, ఫుట్ నోట్‌కి బ్రాకెట్లు పెట్టి, అది పూర్తి అయ్యేదాకా ఇవ్వడమే మంచిది. అది పూర్తి అయిన తర్వాతే, అసలు పాఠాన్ని చదువుకుంటూ వెళ్ళవచ్చు. ఈ ఫుట్ నోట్లని నేనే చాలా తగ్గించి, అక్కడక్కడా వేరే మాటలు కూడా అవసరమైతే చేర్చి ఇస్తున్నాను. ఈ మార్పు ప్రతి చోటా కాదు. కొన్ని ఫుట్ నోట్లని తగ్గించకుండానే ఇచ్చి తీరాలి. - ఇప్పుడు, ఈ చాప్టరులో వున్న పాఠాన్ని చదవడం ప్రారంభించక ముందే, 6 వ ఫుట్ నోట్‌ని చదవాలి. ఈ ఫుట్ నోట్లన్నీ రష్యా ప్రచురణలో ఇచ్చినవే. ]

---

**6.** 'బూర్జువాలు' అంటే, ఉత్పత్తి సాధనాల స్వంత దార్లూ, ఇతరుల చేత కూలి పని చేయించుకునే వాళ్ళూ ఐన ఆధునిక పెట్టుబడి దార్లు. ఈ 'బూర్జువా' అనే మాట, ఫ్రెంచి మాట. పెట్టుబడిదారీ విధానం పుట్టక ముందే ఈ మాట ఉంది. అప్పుడు, ఆ మాటకి 'పట్టణ పౌరుడు' అని అర్థం. గ్రామాల్లో కాకుండా, పట్టణాల్లో చిన్న స్థాయి వర్తకులుగానూ, స్వంత చేతి పనుల వారిగానూ వుండే వారిని, 'బూర్జువాలు' అనేవారు. ఆ కాలంలో, భూస్వాములు, పై వర్గం. ఈ బూర్జువాలు, మధ్య తరగతి. క్రమ క్రమంగా, ఈ మధ్య తరగతే, పెట్టుబడిదారీ వర్గం అయ్యారు. 'కార్మికులు' అంటే, స్వంత ఉత్పత్తి సాధనాలు లేక, తమ 'శ్రమ శక్తి'ని అమ్ముకునే కూలి వాళ్ళు. *

---

[ ఈ మొదటి చాప్టరుకి టైటిల్ దగ్గిరే 6 వ ఫుట్ నోట్ వుంది కదా? ఈ చాప్టరులో మొదటి వాక్యం ప్రారంభం కాగానే అందులో ఒక మాట దగ్గిర 7 వ ఫుట్ నోట్ నంబరు వుంది. ఈ చాప్టరులో మొదటి

వాక్యం ఇలా ఉంది: "ఇంత వరకూ నడిచిన చరిత్ర[7] అంతా, వర్గ పోరాటాల చరిత్రే." ]

---

7. "చరిత్ర అంటే, రాతలో వున్న చరిత్ర మాత్రమే. రాత పుట్టక పూర్వం, ఆదిమ సమాజంలో, 'ఆస్తి' అనేది లేదు, 'శత్రు వర్గాలు' లేవు. 1847లో, ఈ 'కమ్యూనిస్టు ప్రణాళిక' వచ్చే వరకూ, ఆదిమ మానవ చరిత్ర అనేది దాదాపు ఏమీ తెలియదు. ఈ ప్రణాళిక తర్వాత, ఇంకా 20 ఏళ్ళ నాటికి ఆదిమ చరిత్ర బాగా వెల్లడైంది. 'వర్గ భేదాలు' లేని ఆదిమ సమాజం నించి, 'కుటుంబం' అనేదీ, 'ఆస్తి' అనేదీ, 'రాజ్యం' అనేదీ, 'వర్గాలు' అనేవీ, ఏ విధంగా పుట్టాయో, ఎంగెల్సు రాసిన **'కుటుంబమూ, ప్రైవేటు ఆస్తీ, రాజ్యాంగాల పుట్టుకా'** అనే పుస్తకం వివరిస్తుంది. యజమానీ కార్మికుల పోరాటాల వల్ల, సమాజంలో ఒకో సారి విప్లవ పునర్నిర్మాణం జరుగుతుంది. లేదా, సమాజం ఒకో సారి గత స్తితిలోనే ఆగిపోతుంది. *

---

[ ఇంత వరకూ నడిచిన చరిత్ర, అంతా వర్గ పోరాటాల చరిత్రే - అన్న దాని వల్ల, ఆ 'వర్గ పోరాటం' ఎప్పుడు ప్రారంభమైనట్టు మనం భావించాలి? వర్గాలు లేని ఆదిమ కాలం తర్వాత, తెగల మధ్య జరిగిన పోరాటాలలో, గెలిచిన, తెగ వాళ్ళు 'యజమానులు' గానూ, ఓడిన తెగ వాళ్ళు 'బానిసలు'గానూ, ప్రారంభం అవడమే వర్గాల ప్రారంభంగా అర్థం చేసుకోవాలి. ఆ వర్గ పోరాటాలు, ఈ నాటికీ సాగుతూనే వున్నాయి. - ఈ వర్గ భేదాల్ని ఈ ప్రణాళిక, ఈ మొదటి చాప్టరులోనే, ప్రారంభంలోనే, ఇలా వివరించింది: ]

# ప్రణాళిక ప్రారంభం

**పురాతన** కాలంలో, బానిసా-బానిస కాని పౌరుడూ; రోమన్ కాలంలో, పాలించేవాడూ - ఆ పాలనలో ఉన్న సామా న్యుడూ; భూస్వామ్య యుగంలో, భూస్వామ్య ప్రభువూ- దాసుడూ; మధ్య యుగాలలో, వృత్తి సంఘ

సభ్యుడూ[8] వృత్తి సంఘ కార్మికుడూ; - ఒక్క మాటలో చెప్పాలంటే, పీడకుడూ - పీడితుడూ - పరస్పర శత్రువులుగా, పోరాటాలు చేస్తూ వుండినారు.

8. వృత్తి సంఘ సభ్యుడు (గిల్డ్ మాస్టర్) అంటే, ఒక పట్టణంలో, చేతి పనుల వృత్తి చేసే వాళ్ళు కొందరు కలిసి, ఒక సంఘంగా పెట్టుకుంటారు. అది, ఒక వృత్తి సంఘం (గిల్డ్). ఆ సభ్యులందరూ, ఆ సంఘంలో యజమానులే. గ్రామాల నించి వచ్చే, ఆ వృత్తి చేయగల వాళ్ళు, ఆ సంఘంలో కార్మికులు అవుతారు. వాళ్ళు, ఆ సంఘంలో సభ్యులు కాలేరు. అక్కడి పనులైతే, సంఘం పెట్టుకున్న యజమానులూ, సభ్యులు కాని కార్మికులూ కలిసి చేస్తారు. *

[ 'ప్రణాళిక'లో మొత్తం 5 చాప్టర్లు ఉన్నాయి. మొదటి చాప్టరులోనే మానవ సమాజ చరిత్ర ప్రారంభమవుతుంది. చరిత్రలో, ప్రతీ దశలోనూ శత్రు వర్గాలు రక రకాలుగా వున్నా, ఆ వర్గాల్లో, ప్రతీ వర్గంలోనూ తర తమ భేదాలు ఉంటాయి. ]

**భూస్వామ్య** సమాజపు శిధిలాల నుంచి, ఆధునిక పెట్టుబడిదారీ వర్గం ఉద్భవించినా, ఆ కొత్త వర్గం, పాత వైరుధ్యాలను నిర్మూలించలేదు. అది చేసిందల్లా, పాత పీడన లకు బదులు, కొత్త పీడనలను నిర్మించడమే. - కానీ, ఈ నాడు 'బూర్జువా యుగం' అనే దానికి ఒక ప్రత్యేకత ఉంది. ఈ యుగంలో, బూర్జువా వర్గం, కార్మిక వర్గం - అనే రెండు పెద్ద శత్రు వర్గాలుగా మానవ సమాజం చీలి పోయి వుంది. మధ్య యుగాలలో వుండిన ఫ్యూడల్ దాసుల నించి, తొలి పట్టణాలలోని శాసన రక్షిత స్వతంత్ర పౌరులు[9] ఉద్భవించినారు.

9. భూస్వామ్య ప్రభువుల కింద దాసులుగా ఉండిన వాళ్ళే, పారిపోయి, దూరపు పట్టణాలు చేరి, అనేక పోరాటాల తర్వాత, జీతాల కార్మికులుగా, స్వాతంత్ర్యం సంపాదించుకున్నారు. - ఆ స్వతంత్ర పౌరుల నించే తొలి బూర్జువాలు అభివృద్ధి చెందినారు. *

# 2. కార్మికులూ - కమ్యూనిస్టులూ

‘ప్రణాళిక’లో: మొత్తం కార్మిక వర్గంతో, కమ్యూనిస్టుల సంబంధం ఎలా ఉంటుంది?

[ అసలు, ‘కమ్యూనిస్టులు’ ఎవరు? ‘శ్రమ దోపిడీ’నీ, వర్గ భేదాల్నీ, వ్యతిరేకించే సిద్ధాంతాన్ని అంగీకరిస్తూ, కార్మిక వర్గ విముక్తి కోసం పని చేసేవారే కమ్యూనిస్టులు. ఈ భావాలు గల వారిలో, కార్మికులే కాదు; చిన్న స్థాయి వ్యాపారులూ, చేతి వృత్తుల వారూ, రైతులూ - వంటి వారు కూడా కొందరు ఉంటారు.]

**కార్మిక** వర్గ సమిష్టి ప్రయోజనాలకు భిన్నంగా, విడిగా కమ్యూనిస్టులకు ఏ ప్రయోజనాలూ వుండవు.

కార్మిక వర్గ జనాలలో, వేరు వేరు పార్టీలు ఉండ వచ్చు. ఆ కార్మిక పార్టీలకు, కార్మిక ప్రయోజనాల కోసం అవి ఎలా ఉండాలో, ఆ స్పష్టత వాటికి లేకపోయినా, తాము కార్మిక ప్రజల మేలు కోసమే పని చేసేవిగా ఉంటున్నట్టు భావిస్తాయి.

[ కార్మిక వర్గ ప్రయోజనాలేమిటో స్పష్టంగా తెలియకుండా, అర కొర కోరికలతో మాత్రమే సాగే కార్మిక పార్టీకి, స్పష్టమైన ప్రయోజనాల గురించి నేర్పుతూ, దాన్ని సరైన దారికి మార్చడమే కమ్యూనిస్టుల లక్ష్యం. అంతే గానీ, కార్మిక పార్టీలకు భిన్నంగానూ, తమ స్వంత సంకుచిత మార్గంలోనూ నడవడం, కమ్యూనిస్టుల లక్ష్యం కాదు. ఏదైనా కమ్యూనిస్టు పార్టీ, బూర్జువాల బోధనలతోనే సాగుతూ వుంటే, దానికి కమ్యూనిస్టులు ఎంత బోధించినా అది కళ్ళు తెరవకపోతే, ఆ పార్టీతో కమ్యూనిస్టులు నిర్మొహమాటంగానే ఉండడం తప్పనిసరి అవుతుంది. ఆ కఠినత్వం, కార్మిక వర్గ ప్రయోజనాల కోసమే. ]

**కమ్యూనిస్టులూ,** ఇతర కార్మిక వర్గ పార్టీలూ, గ్రహించవలిసిన విషయాలు ఇవి:

(1) వివిధ దేశాల కార్మికులు చేసే జాతీయ

(స్వదేశీయ) పోరాటాలలో, ఎవరి దేశం ఏదైనప్పటికీ, సమస్త కార్మిక వర్గానికీ వుండే సమష్టి ప్రయోజనాలు ఒకే రకం - అని, ఆ కార్మికులకు కమ్యూనిస్టులు బోధిస్తూ, వారికి ప్రాధాన్యత ఇస్తారు.[44]

---

**44.** ఏ దేశ, ఏ జాతి కార్మికులకైనా, అంతిమ లక్ష్యం, వర్గ రహిత సమాజమే. యే జాతి కార్మికులకూ, విడి విడిగా జాతీయ ప్రయోజనాలు ఉండవు. ఈ విషయానికి కార్మికులు ప్రాధాన్యం ఇచ్చి, అంతర్జాతీయ కార్మిక ఐక్యత కోసం కృషి చేయాలి. *

---

**(2)** బూర్జువా వర్గంతో కార్మిక వర్గం చేసే పోరాటం, వివిధ దశలుగా అభివృద్ధి చెందుతుంది. ఆ అన్ని దశల్లోనూ, కమ్యూనిస్టులు సర్వదా, సర్వత్రా, మొత్తం కార్మిక ఉద్యమ ప్రయోజనాలకు ప్రాతినిధ్యం వహిస్తారు.[45]

---

**45.** రాజకీయ వివేకం లేని కార్మికులకు, తాత్కాలిక ప్రయోజనాలు మాత్రమే ఉంటాయి. కానీ, కమ్యూనిస్టులు, కార్మిక వర్గ ప్రయోజనాలన్నిటినీ దృష్టిలో పెట్టుకుని, కార్మిక వర్గ ఐక్యతనూ, రాజకీయ వివేకాన్నీ, కార్మిక ప్రయోజనాల్నీ అన్నిటినీ, కార్మికులకు బోధించడానికి ప్రాధాన్యత ఇస్తారు. *

---

**కమ్యూనిస్టులు** అనే వాళ్ళు, కార్మిక వర్గ ప్రయోజనాల కోసం అత్యంత పురోగాములుగానూ దీక్షా పూరితులుగానూ, ఉంటారు. [ అలా ఉంటేనే వాళ్ళు కమ్యూనిస్టులవుతారు! ] కమ్యూనిస్టులు, సిద్ధాంత రీత్యా, కార్మిక వర్గం ప్రయాణించవలిసిన మార్గాన్నీ, దాని నియమాలనీ, ఆ వర్గ ఉద్యమ అంతిమ ఫలితాన్నీ, స్పష్టంగా అర్థం చేసుకుంటారు. అలా అర్థం చేసుకోవడం వల్ల, కమ్యూనిస్టులు, సాధారణ కార్మికులకు లేని వివేకంతో ఉంటారు.[46]

---

**46.** కమ్యూనిస్టులు, ఇటు సిద్ధాంత రంగంలోనూ, అటు ఆచరణ రంగంలోనూ, అగ్ర శ్రేణిలో ఉంటారన్నమాట! *

---

**కమ్యూనిస్టుల** తక్షణ లక్ష్యం, కార్మికులను ఒక వర్గంగా ఐక్యం చేయడమూ; బూర్జువా వర్గ ఆధిపత్యాన్ని కూల దోయడమూ, రాజకీయాధికారాన్ని జయించుకోవడమూనూ!

[ రాజ్యాధికారాన్ని సాధించిన తర్వాత, కార్మిక వర్గ పాలన ఎలా సాగాలో, అది వేరే విషయం. అది, బూర్జువా చట్టాలతో, బూర్జువా వర్గ పాలనగానే సాగడం కాదు. ఇది, తర్వాత తెలియవచ్చు. ]

**కమ్యూనిస్టు** సిద్ధాంత నిర్ణయాలు, వేటి మీద ఆధారపడి వుంటాయి? జగత్తునంతా సంస్కరించ దలిచిన ఏ మహానుభావుడో సృష్టించే, ఆవిష్కరించే ఏ భావాల మీదో, ఏ సూత్రాల మీదో, ఆధారపడి వుండవు. శత్రు వర్గ భేదాల్ని, వర్గ రహితం చేసే సూత్రాల మీద ఆధారపడి వుంటాయి.

[ కమ్యూనిస్టు నిర్ణయాలు చేసే పని ఏమిటంటే, మన కళ్ళ ముందు జరుగుతున్న చరిత్ర వల్ల కొనసాగుతున్న మానవ సంబంధాల్ని స్పష్టంగా వివరించడం మాత్రమే. 'శ్రమ దోపిడీ' జరుగుతోందనీ, దాని వల్లనే యజమానీ శ్రామిక సంబంధాలు సాగుతున్నాయనీ, వివరించడం! ]

**అమలులో** వున్న 'ఆస్తి సంబంధాల్ని' రద్దు చేయడం అనేది, ఈ నాడు కమ్యూనిస్టుల ద్వారా జరగవలిసిన కొత్త విషయం కాదు. గతంలో కూడా, అమలులో వున్న ఆస్తి సంబంధాలు, ఎప్పటికప్పుడు రద్దవుతూనే వస్తున్నాయి. ఉదాహరణకు, ఫ్రెంచి విప్లవం (1789-99) ఆ నాటి ఫ్యూడల్ ఆస్తిని రద్దు చేసి, బూర్జువా ఆస్తిని నిలబెట్టింది. కమ్యూనిజానికి ప్రత్యేక లక్షణం, ఏ ఆస్తినైనా రద్దు చేయడం కాదు, బూర్జువా ఆస్తిని రద్దు చేయడమే!

[ **ఆస్తి, 2 రకాలు:** (1) స్వంత శ్రమ మీద ఆధారపడే చిన్న స్థాయి ఆస్తి. (2) ఇతరుల శ్రమలను దోచడం ద్వారా ఏర్పడే భారీ ఆస్తి. యూరప్‌లో అమలులో వున్నది, బూర్జువా ఆస్తి విధానమే కాబట్టి, దాన్ని గురించే చెపుతున్నారు. ]

# 3. సోషలిస్టు, కమ్యూనిస్టు సారస్వతం

## 1. ప్రగతి వ్యతిరేక సోషలిజాలు

[‘సోషలిజం’ అనే ఇంగ్లీషు మాటకి తెలుగు అర్థం, ‘సామ్యవాదం’ అని. ‘కమ్యూనిజం’ అనే మాటకి కూడా అదే అర్థం. ‘సమ సమాజం’ అని కూడా అంటారు. ఈ సోషలిజం, కమ్యూనిజం - అనే మాటలు దాదాపు క్రీస్తు తర్వాత 18వ శతాబ్దపు తత్వవేత్తల ద్వారా ప్రారంభమై, అప్పటి నించీ వాడుకలో ఉంటూనే వున్నాయి. అయితే, మార్క్స్ - ఎంగెల్సులు చెప్పే అదే మాటలకీ, అప్పటికే వాడుకలో వున్న ఆ మాటలకీ, అర్థాలు ఒకే రకంగా వుండవు. సోషలిజం అనే మాటని ప్రగతి వ్యతిరేకులు కూడా ఉపయోగిస్తారు. ఫ్యూడల్ దశ నించీ, సోషలిజం అనేది, ఎటువంటి అర్థాలతో సాగేదో ఈ చాప్టర్‌లో చూస్తాం.]

### (1) ఫ్యూడల్ సోషలిజం:

ఫ్రాన్సు, ఇంగ్లండులలో, ఫ్యూడల్ ప్రభు వర్గాలకు (భూస్వామ్య రాచరికాలు గల వర్గాలకు), ఆ నాటి వాటి స్తితిని బట్టి, వాటి కర్తవ్యం ఏమిటంటే, ఆధునిక బూర్జువా సమాజానికి వ్యతిరేకంగా ప్రచారం చేయడమే. 1830 జూలై నాటి ఫ్రెంచి విప్లవం లోనూ[64], ఇంగ్లండులో సంస్కరణల కోసం జరిగిన బూర్జువా ఉద్యమం లోనూ[65], ఫ్యూడల్ ప్రభు వర్గాలే బూర్జువా నీచ జాతి వాళ్ళ చేతిలో ఓడిపోయినారు[66].

---

64. ఫ్రాన్సులో ఫ్యూడల్ ప్రభువులకు అనుకూలంగా వుండిన 10వ చార్లెస్ రాజు ప్రభుత్వం, 1830 జూలై విప్లవంలో పడిపోయింది. ఆ తర్వాత వచ్చిన లూాయీ ఫిలిప్ ⇨

⇨ ప్రభుత్వం, బూర్జువాలకు (ముఖ్యంగా బడా బూర్జువాలకు) అనుకూలంగా వుండింది. ★

**65.** 1832కు పూర్వం, బ్రిటిష్ పార్లమెంటులో, భూస్వాములకు యెక్కువ స్థానాలు వుండేవి. నియోజక వర్గాల విభజనకూ, వోటు హక్కుకూ కావలసిన అర్హతలూ మొదలైన నియమాలు అన్నీ, భూస్వాములకు అనుకూలంగా వుండేవి. యీ ఎన్నికల వ్యవస్థను మార్చడానికి బూర్జువాలు ఉద్యమం ప్రారంభించినారు. తత్ఫలితంగా 1832లో బూర్జువాలకు అనుకూలంగా కొన్ని సంస్కరణలు జరిగినాయి. ★

**66.** ఫ్యూడల్ ప్రభువులు తర తరాలుగా ఉన్నత వంశీయులు. వాళ్ళ దృష్టిలో కొత్తగా ధనవంతులైన బూర్జువాలు 'హఠాత్తుగా పైకి వచ్చిన నీచజాతి వాళ్ళు!' ★

---

**బూర్జువా** వర్గం గెలిచిన ఆ నీచ జాతి వాళ్ళతో రాజకీయ పోరాటాలు చేయడానికి ఫ్యూడల్ వర్గానికి అవకాశమే లేదు. ఇక ఫ్యూడల్ వాళ్ళకు మిగిలిందల్లా, సారస్వత యుద్ధం మాత్రమే. కానీ, ఆ సారస్వత రంగంలో కూడా, వెనకటి వుద్యమాల్లో పొలి కేకలు పెట్టిన ఫ్యూడల్ వర్గానికి, ఆ పొలి కేకలు పెట్టడం కూడా ఇప్పుడు అసాధ్యమై పోయింది[67].

---

**67.** 1660-1689 మధ్య జరిగిన ఇంగ్లీషు పునస్థాపన కాదు, 1814-1830 మధ్య జరిగిన ఫ్రెంచి పునస్థాపన. (1888 నాటి ఇంగ్లీషు కూర్పుకు ఎంగెల్సు యిచ్చిన వివరణ.) పునస్థాపన (రెస్టొరేషన్) అంటే, రాజులను మళ్ళీ గద్దె యెక్కించడం. రాజులను ఉరి తీసి, కొన్నాళ్ళు రిపబ్లిక్కులుగా వుండిన తర్వాత, 1660లో ఇంగ్లండులోనూ, 1814లో, ఫ్రాన్సులోనూ, మళ్ళీ రాజులను తెచ్చి, సింహాసనాలు అప్పగించినారు. ★

ఫ్యూడల్ ప్రభు వర్గం, తమ స్వంత ప్రయోజనాల విషయాల్ని విస్మరించినట్టు నటిస్తూ, వాటి మాట ఎత్తకుండా పీడిత కార్మిక వర్గ ప్రయోజనాల గురించే మాట్లాడుతున్నట్టు, ఆధునిక బూర్జువా వర్గం మీద నేరారోపణలు సాగించింది. ఆ విధంగా, ఫ్యూడల్ ప్రభు వర్గం, సమాజపు కొత్త యజమాని అయిన బూర్జువా వర్గం మీద ఎగతాళి పాటలు కట్టి, ఆ వర్గం మీద కసి తీర్చుకుంది. - ఈ రకంగా పుట్టింది, ఫ్యూడల్ సోషలిజం! ఇది, సగం ఏడుపూ, సగం వెక్కిరింతా! సగం గత కాలపు ప్రతిధ్వనీ, సగం భవిష్యత్ కాలంలో కార్మిక వర్గానికి ఏదో హాని జరగ బోతోందనే బెదిరింపూ! ఫ్యూడల్ వర్గం తను సాగించే నిశిత వ్యంగ్య విషపూరిత విమర్శలతో, బూర్జువాల గుండెల్ని చీల్చే ప్రయత్నాలు చేస్తూనే వుండేది. కానీ, చరిత్రలో ఆధునిక మార్పుని ఫ్యూడల్ వర్గం అర్థం చేసుకోలేక, పరిహాస్యా స్పదం గానే ప్రవర్తించింది. ఫ్యూడల్ ప్రభు వర్గం, ఆధునిక బూర్జువా వర్గం మీద కార్మికులకు ద్వేషం కలిగించాలనే ఎత్తుగడతో, కార్మిక వర్గపు బిచ్చపు జోలెని తమ జెండాగా తీసుకుంది. ఆ కార్మిక ప్రజలు, ఫ్యూడల్ ప్రచారాలనే నమ్మి, వాళ్ళ వెంట పడినప్పుడైతే, ఆ కార్మికుల పిరుదుల మీదా, వీపుల మీదా చిత్రతైన వున్న ఫ్యూడల్ వంశ చిహ్నాలను చూస్తూ ఫ్యూడల్ వాళ్ళు, వెటకారాలతో విరగబడి నవ్వుతూ వాళ్ళను హీనబరుస్తూ వుండే వాళ్ళు.[68]

**68.** ఫ్యూడల్ ప్రభువుల గుర్రాలకు పిరుదుల మీద ఆ ప్రభువుల వంశ చిహ్నాలే ఉంటాయి. సోషలిజాన్ని ప్రస్తావించే ఫ్యూడల్ ప్రభువుల చేష్టల గురించి, ఆ పోలికే ఇక్కడ కనపడుతోంది. శ్రామిక జనాల వేపు మాట్లాడినట్టు నటించడానికి కారణం, తమ వెనకటి ఫ్యూడల్ వ్యవస్థను తిరిగి స్థాపించాలనే! ★

# 4. ఈ నాటి వివిధ ప్రతిపక్ష పార్టీల పట్ల కమ్యూనిస్టుల వైఖరి

ఇంగ్లండులో చార్టిస్టులూ, అమెరికాలో భూసంస్కరణ వాదులూ మొదలైన నేటి కార్మిక వర్గ పార్టీలతో కమ్యూనిస్టులకు గల సంబంధం రెండవ చాప్టరులో స్పష్టం చేయబడింది. కమ్యూనిస్టులు కార్మిక వర్గం యొక్క తక్షణ లక్ష్యాలు సాధించడానికీ, తాత్కాలిక ప్రయోజనాలు అమలు పరచడానికీ పోరాటం చేస్తారు. కానీ వాళ్ళు, వర్తమాన ఉద్యమంలో, ఉద్యమ భవిష్యత్తుకు కూడా ప్రాతినిధ్యం వహిస్తూ, ఆ భవిష్యత్తు పట్ల కూడా శ్రద్ధ వహిస్తారు. ఫ్రాన్సులో కమ్యూనిస్టులు, యధాస్థితి వాద బూర్జువాలకూ, అతి వాద బూర్జువాలకూ, వ్యతిరేకంగా 'సోషల్ డెమోక్రట్ల'తో[99] పొత్తు కలుస్తారు.

---

**99.** సోషల్ డెమోక్రాట్లు: పార్లమెంటులో లెడ్రూ-రోలిన్ ద్వారానూ, సాహిత్యంలో లూయియీ బ్లాంక్ ద్వారానూ, దిన పత్రికా ప్రపంచంలో 'రెఫార్మ్' పత్రిక ద్వారానూ, ప్రతిబింబించబడిన పార్టీ. డెమోక్రటిక్ లేక రిపబ్లికన్ పార్టీలో, కొద్దో గొప్పో సోషలిస్టు భావాలు గల వాళ్ళకు, 'సోషల్ డెమోక్రసీ' అనే పేరు వర్తిస్తుందని ఆ పేరు పెట్టినవాళ్ళ విశ్వాసం. (1888 నాటి ఇంగ్లీషు కూర్పుకు ఎంగెల్సు వివరణ.)

ఫ్రాన్సులో, 'సోషల్ డెమోక్రటిక్ పార్టీ' - అని పేరు పెట్టుకున్న పార్టీకి, రాజకీయ రంగంలో లెడ్రూ-రోలిన్, సాహిత్యంలో లూయియీ బ్లాంక్, ప్రతినిధులు. కనుక దీనికీ, నేటి జర్మన్ సోషల్ డెమోక్రసీకీ, అనంతమైన భేదం వుంది. (1890 నాటి జర్మన్ కూర్పుకు ఎంగెల్స్ వివరణ.) ★

---

కానీ, ఫ్రెంచి మహా విప్లవ కాలం నుండి సాంప్రదాయకంగా వస్తున్న మాటలనూ, భ్రమలనూ విమర్శించే హక్కు మాత్రం ఉంచుకుంటారు.

స్విట్జర్లండులో కమ్యూనిస్టులు, రాడికల్ పార్టీని బలపరుస్తారు. కానీ, ఆ పార్టీలో పరస్పర విరుద్ధమైన అంశాలు వున్నాయని, అంటే అతి వాద బూర్జువాలు కొందరూ, ఫ్రాన్సులో వున్నట్టి డెమోక్రటిక్ సోషలిస్టులు కొందరూ వున్నారని, ఆ విషయాన్ని కమ్యూనిస్టులు విస్మరించరు.

పోలెండులో, జాతీయ విమోచనకు వ్యవసాయ విప్లవం అవశ్య కర్తవ్యమని పట్టుబట్టే పార్టీని, 1846 నాటి క్రాకోవ్ తిరుగుబాటును యే పార్టీ లేవదీసిందో ఆ పార్టీని, కమ్యూనిస్టులు బలపరుస్తారు.[100]

100. పోలెండు, జర్మనీకీ, ఆస్ట్రియాకూ, రష్యాకూ, లోబడి వుండేది. పోలిష్ జాతీయ స్వాతంత్ర్య పోరాటం, విజయవంతం కావాలంటే, ఆ పోరాటంతో పాటు ఫ్యూడల్ వ్యవస్థ మీద బూర్జువా ప్రజాతంత్ర విప్లవం కూడా ఏక కాలంలో జరగాలని, పోలిష్ డెమోక్రటిక్ పార్టీ విశ్వసించింది. ఇక్కడ వ్యవసాయ విప్లవమంటే, ఫ్యూడల్ వ్యవస్థ మీద విప్లవమే. పోలిష్ డెమోక్రటిక్ పార్టీ 1846 జనవరి 24న, క్రాకోవ్ నగరంలో, తిరుగుబాటు లేవదీసి 'దున్నే వానికే భూమి' అని ప్రకటించింది. ఆ తిరుగుబాటు ఓడిపోయిందనుకోండీ! ★

జర్మనీలో, బూర్జువా వర్గం విప్లవ కరంగా ప్రవర్తించినప్పుడల్లా, కమ్యూనిస్టులు ఆ బూర్జువా వర్గంతో కలిసి నిరంకుశ రాజరికానికీ, ఫ్యూడల్ ప్రభు వర్గానికీ, పెటీ బూర్జువా వర్గానికీ వ్యతిరేకంగా, పోరాటం చేస్తారు. కానీ, బూర్జువా వర్గానికీ, కార్మిక వర్గానికీ గల శతృత్వాన్ని కార్మికులు, స్పష్టాతి స్పష్టంగా గుర్తించేటట్లు చేయడానికి కమ్యూనిస్టులు ఒక్క క్షణం కూడా విరామం లేకుండా కృషి చేస్తారు. ఈ కృషి యెందుకంటే, బూర్జువా వర్గం తాను అధికారంలోకి వచ్చినప్పుడు, ఆ అధికారం వెంట విధిగా ప్రవేశపెట్టే సాంఘిక రాజకీయ పరిస్థితులను, జర్మన్ కార్మికులు వెనువెంటనే ఆయుధాలుగా ఉపయోగించి బూర్జువా వర్గంతో

పోరాడేటందుకూ, జర్మనీలో ప్రగతి నిరోధక వర్గాలు పతనమైన తర్వాత, ఆ క్షణం నుండి బూర్జువా వర్గంతోనే పోరాటం ప్రారంభ మయ్యేటందుకూనూ.

కమ్యూనిస్టులు ప్రధానంగా జర్మనీ మీదికి దృష్టి మళ్ళిస్తారు. యెందుకంటే, ఆ దేశం బూర్జువా విప్లవ ప్రాంగణంలో వుంది గనుకనూ; 17వ శతాబ్దపు ఇంగ్లండులో కంటే, 18వ శతాబ్దపు ఫ్రాన్సులో కంటే బాగా అభివృద్ధి చెందిన కార్మిక వర్గంతోనూ, గతంలో కంటె బాగా అభివృద్ధి చెందిన యూరోపియన్ నాగరికతా వాతావరణంలోనూ ఆ జర్మన్ బూర్జువా విప్లవం జరిగి తీరుతుంది గనుకనూ; ఆ బూర్జువా విప్లవం, ఆ వెనువెంటనే వచ్చే కార్మిక వర్గ విప్లవానికి ఉపోద్ఘాతంగా మాత్రమే వుంటుంది గనుకనూ. ఒక్క మాటలో చెప్పాలంటే, కమ్యూనిస్టులు ప్రతి చోటా ఆ నాటి సాంఘిక రాజకీయ వ్యవస్థకు వ్యతిరేకంగా జరిగే ప్రతి విప్లవోద్యమాన్నీ బలపరుస్తారు.

ఈ సకల ఉద్యమాలలోనూ వాళ్ళు ఆస్తి సమస్యను ప్రధాన సమస్యగా ముందుకు తెస్తారు - ఆ నాటికి ఆస్తి వ్యవస్థ, యే మేరకు అభివృద్ధి చెంది వుండినా సరే.

**చివరి విషయం:** సకల దేశాల ప్రజాతంత్ర పార్టీల మధ్యా ఐకమత్యమూ, అభిప్రాయ సామ్యమూ నెలకొల్పడానికి కమ్యూనిస్టులు కృషి చేస్తారు. కమ్యూనిస్టులకు తమ అభిప్రాయాలూ, లక్ష్యాలూ, దాచుకోవడ మంటే అసహ్యాం. సమస్త వర్తమాన సాంఘిక పరిస్థితులనూ బలవంతంగా కూలదోయడం ద్వారానే తమ లక్ష్యాలు సిద్ధించగలవని వాళ్ళు బహిరంగంగానే ప్రకటిస్తారు. కమ్యూనిస్టు విప్లవ మంటే పాలక వర్గాలు గజ గజ వణకనీ! కార్మికులు పోగొట్టుకొనే దేమీ లేదు, తమ శృంఖలాలు తప్ప! వాళ్ళు గెలుచుకో వలసింది ఒక ప్రపంచం వుంది!

**సకలదేశ కార్మికులారా, ఏకం కండి!**

**[4వ చాప్టరు ముగిసింది.]** ★

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Communist+Party+Pranalika+Parichayam**

* * *